క్లుప్తంగా

వడ్డీ మినహాయింపుతో 31లోగా పన్నులు చెల్లించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ నెలాఖరులోపు బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 2023 – 2024 ఆర్థిక సంవత్సరం వరకు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై విధించిన వడ్డీని మాఫీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే 2023 – 2024 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వడ్డీతో చెల్లించి ఉన్నట్లయితే ఆ వడ్డీని 2024 – 2025 సంవత్సరం ఆస్తి పన్నుకు జమ చేస్తారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు నగరంలోని మూడు సర్కిల్స్ పరిధిలోగల అన్ని క్యాష్ కౌంటర్లలో సకాలంలో చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలను కోరారు. క్యాష్ కౌంటర్లు పని దినాల్లోనే కాకుండా సెలవు దినాల్లోనూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ తరుపున నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

త్వరలో ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ అర్బన్ పరిధిలో అర్హులకు ఇళ్ల స్థలాలపై పూర్తిహక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పత్రాలు అందించే కార్యక్రమం త్వరలో జరగనుందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ కారణాల వల్ల తమ ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న అర్బన్ పరిధిలో అర్హులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా హక్కు పత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించేందుకు కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి విజయవాడ పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వివిధ శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. గతంలో వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా అందజేసిన నివాస స్థలాల్లో కొన్ని 22(ఏ) కింద ఉండటం, పట్టాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ లేకపోవడం వంటి కారణాల వల్ల ఆయా స్థలాల లబ్ధిదారులు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. వీరి ఇబ్బందులను తొలగించి పూర్తిహక్కులు కల్పిస్తూ దాదాపు 30 వేల మందికి ఫ్రీ హోల్డ్ రైట్స్ పత్రాలు అందిస్తామని తెలిపారు. కృష్ణా నది రిటైనింగ్ వాల్, పార్కు తదితర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, కేసీ డివిజన్ ఈఈ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేశారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ రూరల్ ప్రాంతానికి ఎస్ఐగా సీతారామాచార్యులు విధులు నిర్వహిస్తుంటారు. బుధవారం తెల్లవారుజామున పాముల కాల్వ వద్ద గస్తీ నిర్వహిస్తుండగా, ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని ఆరా తీయగా న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన ఈగల సతీష్‌గా గుర్తించారు. నిందితుడి వద్ద ఉన్న చేతి సంచిలో 6 క్వార్టర్ బాటిల్స్‌తో మద్యం, 20 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఉపాధిని సృష్టించే వ్యక్తులుగా ఎదగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సొంత వ్యాపార, పరిశ్రమల ఏర్పాటుకు పాటుపడాలని ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏవీఆర్ సుబ్బారావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో 'ఆధునిక కాలంలో వ్యాపార సంస్థల స్థాపన, అభివృద్ధి' అంశంపై సదస్సు నిర్వహించారు.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉపాధి అవకాశాల కోసం కాకుండా వాటిని సృష్టించే దిశగా తమ ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. నేడు సమాజంలో అనేక అవకాశాలు ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకునే దిశగా ముందుకు సాగాలన్నారు. ఎస్‌బీఐ మరో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగంలో విద్యార్థులు చాలా విజ్ఞానాన్ని కలిగి ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన శైవాలయాలకు కేంద్రం పాతబస్తీ

మహా శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చారిత్రక నేపథ్యంతో పాటుగా పౌరాణిక ఇతిహాసాలతో ముడిపడి ఉన్న పురాతన శైవాలయాలకు విజయవాడ కేంద్రంగా ఉంది. అందులోనూ పాతబస్తీ ప్రముఖ ఆలయాలకు నిలయంగా బాసిల్లుతోంది. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు ఈశాన్య దిక్కున పరమేశ్వరుడు మల్లేశ్వరస్వామి దర్శనమిస్తున్నారు. అలాగే దక్షిణ దిక్కున విజయేశ్వరస్వామిగా భక్తుల కోరికలు తీరుస్తున్నారు. కొండ దిగువన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిగా (పాతశివాలయం) భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తున్నారు.



దుర్గమ్మ సన్నిధిలో మల్లేశ్వరస్వామి దేవస్థానం

మల్లేశ్వరస్వామి ఆలయం (దుర్గగుడి)

ఇంద్రకీలాద్రిపై బ్రహ్మాది దేవతల అభీష్టం మేరకు ఆదిపరాశక్తి మహిషమర్ధినీ స్వరూపంతో అవతరించింది. విశేష తేజస్సుతో కనకవర్ణంతో వెలుగొందుతున్న ఆ అమ్మ కాలక్రమంలో కనకదుర్గగా కీర్తించబడింది. అలాంటి ఆ పర్వతంపైనే ఈశ్వరుణ్ణి కూడా కొలువుండేలా చేయాలని భావించిన బ్రహ్మ అత్యంత భక్తిప్రపత్తులతో శతాశ్వమేథ యాగాల్ని చేశాడు. బ్రహ్మ విశేష భక్తిశ్రద్ధలకు సంతసించిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో ఆ బ్రహ్మ దేవునికి దర్శనమిచ్చినట్లు స్కాంధ పురణంలో చెప్పబడినట్లు పండితులు చెబుతారు. ఇక్కడ పరమేశ్వరుణ్ణి బ్రహ్మ మల్లీకదంబ పుష్పాలతో అర్చించాడు కాబట్టి ఆ స్వామికి మల్లేశ్వరుడు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో కలిప్రభావం వలన ఈ జ్యోతిర్లింగం అదృశ్యంగా ఉండటాన్ని చూసిన శ్రీ శంకరాచార్యులవారు కనకదుర్గాదేవికి ఉత్తర భాగంలో మల్లేశ్వర లింగాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. ఆనాటి నుంచి స్వామి వారు విశేష పూజలందుకుంటున్నారు. అయితే మల్లేశ్వరస్వామికి దక్షిణ దిక్కున కనకదుర్గమ్మ కొలువుండటంతో ఇది శక్తి ప్రధానమైన క్షేత్రంగా వెలుగొందుతుంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని మల్లేశ్వరస్వామి వారికి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే పలు ప్రత్యేక వాహన సేవలు జరగనున్నాయి. లోకకళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలతో పాటుగా ప్రత్యేక మంత్ర జపానుష్టానాలను నిర్వహించేందుకు దేవస్థానం పలువురు రుత్వికలను ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు..

పాతశివాలయం

పాండవ అగ్రజుడు ధర్మరాజుచే ప్రతిష్ఠింపబడిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యం భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రజలచేత పాతశివాలయంగా పిలవబడే ఈ ఆలయానికి కూడా పౌరాణిక గాధలు ఉన్నట్లు పండితులు చెబుతారు. ఈ ఆలయం పూర్వం సాలుసహస్రస్తంభ దేవాలయంగా అంటే వేయి స్తంభాలతో విస్తరించి ఉండేదని చరిత్ర చెబుతుంది. శ్రీశైల దేవస్థానం తరువాత అంతటి ప్రాచీనత ఈ ఆలయానికి ఉందని పండితులు చెబుతారు. ఈ ఆలయాన్ని ధర్మరాజు ప్రతిష్ఠించడాని అలాగే పశ్చిమ చాళుక్య రాజైన త్రిభువన మల్లుడు క్రీ.శ పదవ శతాబ్దంలో తన పేరుమీదుగా త్రిభువన మల్లేశ్వరాలయాన్ని నిర్మాణం చేశారని చెబుతుంటారు. మొత్తం మీద ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉన్నట్లు తెలుస్తోంది. విజయవాడ నగర పౌరాణిక, చారిత్రిక అంశాలను వివరించే పలు శాసనాలు కూడా ఈ ఆలయంలో భద్రపరిచారు. అదేవిధంగా ఈ ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల ఆలయాలు కూడా మనకు దర్శనమిస్తాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని పాతశివాలయంలో పాంచాహ్నిక కళ్యాణ రథ, పుష్ప, యాగోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు. ఈ నెల ఆరు నుంచి 13వ తేదీ వరకూ వివిధ ప్రత్యేక వైదిక కార్యక్రమాలు, వాహనసేవలు ఉంటాయని తెలిపారు.

విజయేశ్వరస్వామి వారి ఆలయం

దుర్గగుడి దిగువన పాత అశోక్ పిల్లర్ సమీపంలో రోడ్డును అనుకొని ఉన్న ఆలయమే విజయేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయంలో స్వామివారిని పాండవ మధ్యముడైన అర్జునుడు ప్రతిష్ఠించాడని ప్రతీతి. అర్జునుని తపస్సుకి శివుడు పరమానందభరితుడయ్యాడు. చివరిగా అర్జునుని పరీక్షించాలని భావించి మాయాకిరాతుడి వేషంలో ఇంద్రకీలాద్రిపై ప్రత్యక్షమయ్యాడు. శివుని ఆజ్ఞతో మూకాసురుడు ఒక వరాహం రూపాన్ని ధరించి అర్జునుడి తపస్సుని భంగపరచడానికి ప్రయత్నించాడు. మాయా వరాహం చేసిన అల్లరితో తపోభంగమైన అర్జునుడు తీవ్రమైన కోపంతో బాణాన్ని సంధించి ఆ వరాహం మీదకు వదిలాడు. సరిగ్గా అదే సమయంలో మాయా కిరాతుడి రూపంలో ఉన్న శివుడు కూడా తన బాణంతో పందిని కొట్టాడు. మరణించిన ఆ వరాహం దగ్గరకు అర్జునుడు, కిరాతుని రూపంలోని శివుడు ఒకేసారి వచ్చారు. నా బాణం వలనే ఆ పంది మరణించింది కాబట్టి నాదంటే నాది అంటూ ఇద్దరూ వాదనకు దిగారు. ఇద్దరి మధ్య యుద్ధం ప్రారంభమైంది. ఓడిన అర్జునుడు మల్ల యుద్ధానికి దిగాడు. అయినా పరమేశ్వరుణ్ణి జయించలేకపోయాడు. అంతటి పరమేశ్వరుడు నిజరూపంలో అర్జునునికి దర్శనమిచ్చి పాశుపతాస్త్రాన్ని బహూకరించాడు. అర్జునుడు పరమేశ్వరుణ్ణి అనేక విధాలుగా స్తుతించి ఇంద్రకీలాద్రి పైనే దక్షిణ భాగాన ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. కాలక్రమంలో ఈ ఆలయం విజయేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్వామివారికి ఇక్కడ పలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నెల ఆరో తేదీ మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది.



విజయేశ్వరస్వామి వారి దేవస్థానం



పాతశివాలయం

ధర్మేశ్వరస్వామి ఆలయం

కొత్తపేటలో మరో ప్రముఖ శివాలయం శ్రీ ధర్మేశ్వరస్వామి వారి ఆలయం. ఈ ఆలయాన్ని రాంపిళ్ల సూర్యనారాయణ నిర్మించారు. కొత్తపేటలో అత్యధిక శాతం ప్రజలు పాతశివాలయం తరువాత ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని స్వామివారికి బుధవారం నుండి ఈ నెల 13వ తేదీ వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకవర్గ అధ్యక్షులు రాంపిళ్ల జయప్రకాష్ చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా సీఎం జగన్



విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేసిన గొప్ప మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసీఫ్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్‌లోని మహిళలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లను స్థానిక కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణాచంద్రరావుతో కలసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆసీఫ్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సుమారు 33 లక్షల మంది పేద మహిళలకు ఇళ్ల పట్టాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలను అందిస్తూనే వారికి సొంత ఇంటిని కూడా అందించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఏ ఒక్క పేద కుటుంబానికి అయినా గజం స్థలం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. నిత్యం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచన చేసే జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సలీం, పల్లె బాబు, సుభానిఖాన్, మండల శ్రీను, పునూరి జార్జి, డెవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన సూర్యప్రభ సంగీత అకాడమీకి చెందిన లలిత, శ్రీనిత్య, సురేఖ, జగన్మోహిని, అభిరామ్‌లు ఆలపించిన భక్తి రంజని భక్తులకు అకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు అమ్మవారి కీర్తనలు ఆలపించారు. భక్తిరంజనిని ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

జనం మెచ్చిన సీఎం జగనన్న

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో జనం మెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్పొరేటర్ బలసాని మణిమ్మ, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి 35వ డివిజన్‌లో పర్యటించారు. ఫిలిమ్ గూడం, డేవిడ్‌వీధి, పాత బజారు, పెరుమాళ్లవారివీధి, కత్తి రామయ్యవీధుల్లో పర్యటించిన అయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి స్థానిక ప్రజలకు వివరించారు. విద్యాదీవెన, అమ్మ ఒడి, చేయూత తదితర పథకాలతో లక్షలాదిమంది కుటుంబాల్లో జగనన్న వెలుగులు నింపారన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా డివిజన్‌లో కోట్లాది రూపాయల నిధులతో డేవిడ్ వీధి, పాల బజార్, మెయిన్‌రోడ్డు, సీసీరోడ్లు, పార్కులు, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఏ విధమైన అభివృద్ధి జరగలేదన్నారు. డివిజన్‌లోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని తెలిపారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, పార్టీ నాయకులు శ్యామ్, నాగరాజు, సుజాత దాసు, ఫిలోమెన్, సంగీత్‌బాబు, సుధీర్, ప్రేమ్, దినేష్,థామస్, ఏనుగుల సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్

9న కెనాల్‌రోడ్డులో రథోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని కన్యక పరమేశ్వరీ అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన కెనాల్‌రోడ్డులో రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చు వెంకటప్రసాద్ బయన శ్రీరాజేష్ చెప్పారు. వన్‌టౌన్‌లోని కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 150 సంవత్సరాలకు పైగా కెనాల్‌రోడ్డులో స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు సంబంధించి 1871లో ఏర్పాటు చేసిన తమ సంస్థ మొదటిదని వివరించారు. తమ కమిటీ ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల ఆరు నుంచి 13వ తేదీ వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. శివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక వైదిక కార్యక్రమాలుంటాయని వివరించారు. తొమ్మిదో తేదీన జరిగే రథోత్సవంలో దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుంచి శ్రీదుర్గా, గంగా సమేత మల్లేశ్వర స్వామి వార్లు, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం) నుంచి శ్రీభ్రమరాంబ మల్లేశ్వర, శ్రీభద్రకాళీ వీరభద్రస్వామి వార్లు, వసంత మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం నుంచి గంగా పార్వతీ సమేత వసంత మల్లేశ్వరస్వామి ఆలయాల ఉత్సవమూర్తులు రథంపై అధిష్ఠింపజేస్తామన్నారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. మేళతాళలతో పాటుగా డప్పు నృత్యాలు, లంబాడీ నృత్యాలు, పులి వేషాలు, భేతాళ నృత్యాలు తదితర చిత్రవిచిత్ర వేషధారణలతో కళాకారులు పాల్గొంటారని వివరించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10వ తేదీన దుర్గాఘాట్‌లో అవబృధోత్సవం, సాయంత్రం చోరసంవాదం, 11వ తేదీన పవళింపు సేవలు ఉంటాయని వెల్లడించారు. అలాగే అన్నసత్రం కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. రథోత్సవానికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్‌రావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి ఈవో కెఎస్ రామారావు, తదితరులు విశిష్ట అతిథులుగా విచ్చేస్తారని పేర్కొన్నారు. కార్యదర్శి మట్టా వెంకట సుబ్బారావు, ప్రథమ ఉపాధ్యక్షుడు వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, ద్వితీయ ఉపాధ్యక్షుడు వల్లంకొండ ప్రసాద్, సహాయ కార్యదర్శులు డోగుపర్తి శంకర్రావు, బొలిశెట్టి జగన్మోహన్ రావు, కోశాధికారి చల్లా హరినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న బచ్చు వెంకటప్రసాద్, బయన శ్రీరాజేష్

● ఉరకలెత్తిన ఉత్సాహం





మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, దేవినేని నెహ్రూ విగ్రహాలకు నివాళలర్పిస్తున్న అవినాష్ తదితరులు, సీడీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడతూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. ఎన్నికలకు మేము సిద్ధం అంటూ నినాదాలు హోరెత్తించారు. గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కళ్యాణ మండపంలో బుధవారం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సభలో బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లుతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. పండుగ వాతావరణంలో నిర్వహించిన సభలో నాయకులు ఎన్నికలకు సిద్ధమా అంటే మేము సిద్ధం అంటూ పిడికిలి బిగించి చేతులెత్తి నినదించడంతో సభా ప్రాంగణం హోరెత్తింది. అంతేకాదు అవినాష్ సమర్థత గురించి అతిథులు చెబుతుంటే కార్యకర్తలు ఉత్సాహంతో నినాదాలు చేశారు.

–లబ్బీపేట(విజయవాడతూర్పు)



హాజరైన నాయకులు, కార్యకర్తలు

ధర్మకర్తల మండలి సభ్యులుగా బాధ్యతల స్వీకారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యురాలిగా అమలాపురపు రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులైన అల్లం భువన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయానికి చేరుకున్న అమలాపురపు రామలక్ష్మి, అల్లం భువన్‌కుమార్ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం ఆలయ ఈవో కెఎస్.రామారావును మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత ఆలయానికి చేరుకున్న ధర్మకర్తల మండలి సభ్యురాలు రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు భువన్‌కుమార్‌లు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు. పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన రామలక్ష్మిని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, భువన్‌కుమార్‌ను 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, మైలవరపు దుర్గారావు, మాగం ఆత్మారామం, ముత్యాల రాంబాబు, శివరామరెడ్డి, మాదాల తిరుపతయ్య తదితరులు అభినందనలు తెలిపారు.



రామలక్ష్మికి అభినందనలు తెలుపుతున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు



భువన్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

నటుడు అక్కినేని విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశం గర్వించతగ్గ మహానటుడు, దాదా పాల్కే అవార్డ్ గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో అక్కినేని శిలా విగ్రహం ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన, పూజా కార్యక్రమం జరిగింది. డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళా నిలయమైన ఈ కళాక్షేత్ర ప్రాంగణంలో అక్కినేని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా స్థలం కేటాయించేందుకు కృషి చేసిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)కు ధన్యవాదాలు తెలిపారు. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడలో మహానటుడు డాక్టర్ అక్కినేని విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేయటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, మాదు కృష్ణారావు, డీ లక్ష్మీకుమారి, రాజు, రాజారావు, నాగమల్లిక, షఫీ, ఎం రాము తదితరులున్నారు.



అక్కినేని విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న సొసైటీ ప్రతినిధులు